సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం ‍। 27 ‍। నవంబర్ ‍। 2024



రాజ్యాంగమే ప్రజలకు రక్ష

రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ అని అలాంటి రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. -8లో



సారూ.. పరిష్కారం చూపరూ.!

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.4800	రూ.560
రెండోరకం	రూ.320	రూ.468



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 160 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	510	510
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 40.000 కిలోలు

న్యూస్‌రీల్

30న పింఛన్లు పంపిణీ

రాయచోటి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 30వ తేదిన లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయికి చేరుకొని పింఛన్ల పంపిణీకి అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

'భూమి గోవిందా'పై సమగ్ర విచారణ

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: చెన్నకేశ్వస్వామీ..నీ భూమి గోవిందా శీర్షిక మంగవారం ప్రచురితమైన సాక్షి కథనంపై దేవదాయధర్మాదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ స్పందించారు. కథనంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక పంపాలని మదనపల్లె ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్‌ను ఆదేశించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములను సెంటు భూమిలేని వెంకటేశ్వర స్వామి దేవస్థానం పేరుతో రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడాన్ని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై రెవెన్యూ, ఆలయ భూముల రికార్డులను తక్షణమే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై ఆయన రెండ్రోజుల్లో సమగ్ర విచారణ చేపట్టనున్నారు.

నేడు 'బాల్య వివాహ ముక్త్ భారత్'

రాయచోటి: అన్నమయ్య జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేసేందుకు ఈ నెల 27న ''బాల్య వివాహ ముక్త్ భారత్'' ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్, మునిసిపల్, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలలో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు అందులో పేర్కొన్నారు. జిల్లాలోని పౌరులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిజ్ఞ చేపట్టి ఆ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు.

హార్సిలీహిల్స్‌పై ఆగిపోయిన సర్వే

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై రెవెన్యూ భూములపై చేపట్టిన సర్వే నిలిచిపోయింది. ఐదుగురు సర్వేయర్లతో కొండపై 103 ఎకరాల భూమి స్థితి గతులపై సమగ్రంగా సర్వే నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్నిరోజులు సర్వే చేసిన సర్వేయర్లు తాజాగా ఆపివేశారు. ఉన్నతాధికారులు ఇతర పనులు అప్పగించడంతో ఈ సర్వే నిలిచిపోయినట్టు తెలిసింది. కొండపై అటవీశాఖ నుంచి రెవెన్యూశాఖకు బదలాయించిన భూమిలో ఎంత భూమి ఎవరి చేతుల్లో ఉంది, ఏ ప్రభుత్వశాఖకు ఎంత భూమి కేటాయించారు, నిరుపయోగంగా ఉన్న భూమి ఎంత, వినియోగంలోని భూమి ఎంత అన్నదానిపైనా, మిగిలిన విస్తీర్ణంపైనా సర్వే పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం సర్వే ఆగిపోవడంతో మళ్లీ ఎప్పుడు మొదలయ్యేది ఉన్నతాధికారుల ఆదేశాలొచ్చాకే అని తెలుస్తోంది.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి

చిట్వేలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన స్వర్ణ పంచాయతీ సైట్‌లో డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి పంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి సూచించారు. మంగళవారం చిట్వేలి గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డులను పరిశీలించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలలో పాల్గొన్న ఎడ్లు


ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలోని భక్తులందరూ స్వామివారికి ప్రత్యేక పూజా కైంకర్యాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేయగా జిల్లా నలుమూలల నుండి ఐదు జత ఎడ్లు పోటీ పడ్డాయి. ఇందులో కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటపల్లికి చెందిన సర్పంచ్ చంద్రబాబు రెడ్డి ఎడ్లు ప్రథమ స్థానం, ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు రెండో స్థానం, చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్ రెడ్డి ఎడ్లు మూడో స్థానం, పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు సుధాకర్‌రెడ్డి ఎడ్లు నాల్గో స్థానం, ఒంటిమిట్ట మండలం పెద్దకొత్తపల్లెకు చెందిన పూల రమణ ఎడ్లు చివరి స్థానంలో నిలిచాయి. నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

పోరాట బాట!

- తమ సమస్యలను పరిష్కరించాలంటున్న అంగన్వాడీలు
- అధికార వేధింపులు ఆపాలని హెచ్చరికలు
- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మూడుమార్లు ఆందోళనలు
- ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరు ఆపేది లేదంటున్న అంగన్వాడీలు
- వామపక్షాలతోపాటు మద్దతు పలుకుతున్న వైఎస్సార్ సీపీ



అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావం వ్యక్తం చేస్తున్న పలు పార్టీల నాయకులు



సాక్షి రాయచోటి: అంగన్వాడీల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి సర్కార్ మీనవేషాలు లెక్కిస్తోంది. అనుక్షణం వేధింపులు...అనక బెదిరింపులతో ఆ శాఖలోని మహిళా లోకాన్ని వణికిస్తోంది. అధికారంలోకి రాకముందు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని గొప్పగా చెప్పి ప్రస్తుతం పట్టించుకోకపోవడంపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు. అమలు చేయనపుడు మాట ఇవ్వడం ఎందుకంటూ నిలదీస్తూనే మరోవైపు ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందేనంటూ పోరుబాట పడుతున్నారు. కూటమి సర్కార్ అధికారం చేపట్టిన ఈ ఐదున్నర నెలల్లో అంగన్‌వాడీలు ఉద్యమించడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సుమారు మూడుమార్లు అంగన్వాడీ వర్కర్లతోపాటు ఆయాలు ఆందోళనలు చేపట్టారు. ఇప్పటికే జిల్లా కేంద్రమైన రాయచోటిలో ర్యాలీలు నిర్వహించడంతోపాటు...కలెక్టరేట్ ఎదుట ధర్నాతోపాటు చలో కలెక్టరేట్ కార్యక్రమాలతో దద్దరిల్లిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలతోపాటు స్థానికంగా ఆందోళన బాట పడుతున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడంపై అంగన్వాడీ సంఘాలు మండిపడుతున్నాయి. అంగన్‌వాడీలకు అన్ని పక్షాల మద్దతు లభిస్తోంది.

వర్షంలోనూ జోరుగా ఆందోళన

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ ఎదురుగా ఆల్ ట్రేడ్ యూనియన్‌తోపాటు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఇందులో పెద్ద ఎత్తున అంగన్వాడీలతోపాటు ఇతర వర్గాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు వర్షంలోనూ నినాదాలు చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్వాడీలపై అధికార పార్టీ వేధింపులు

అంగన్వాడీల్లో పనిచేస్తున్న ఆయాలు, కార్యకర్తలపై అధికార పార్టీ వేధింపులు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 30-40 మందిపై అధికార పార్టీ వేధింపుల పర్వం కొనసాగించింది. గతంలో అధికార పార్టీ అయిన వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారని, మీరు తప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి చేస్తుండడంతో ఇటీవల సంబేపల్లె మండలానికి చెందిన ఓ కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేయడంతో అధికార పార్టీ నాయకులు వెనక్కి తగ్గారు. జిల్లా వ్యాప్తంగా వేధింపులపై కూడా అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద గతంలో ఆందోళన చేశారు.

విపక్షాల నుంచి మద్దతు..

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంబంధించి మూడు నెలలుగా జరుగుతున్న పోరాటాలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతోపాటు వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు మద్దతు తెలియజేస్తున్నాయి. తక్కువ వేతనంతో వెట్టిచాకిరి చేస్తున్న మహిళా కార్మికుల విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

అంగన్వాడీల డిమాండ్లు



- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- అర్హులైన ఆయాలకు పదోన్నతులు కల్పించాలి
- అంగన్వాడీ వర్కర్లు, ఆయాలపై అధికార పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులు ఆపాలి.
- అంగన్వాడీ వర్కర్లను రెగ్యులర్ చేయాలి.
- ప్రతి కార్మికురాలికి కనీస వేతనం రూ. 26 వేలు అందేలా చూడాలి.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి సర్కార్ అమలు చేయాలి. న్యాయమైన డిమాండ్ల పరిష్కారంతోపాటు సమాన పనికి సమాన వేతనం అందించాలి. కార్యకర్తలు, ఆయాలపై వేధింపులు మానుకోవాలి. అంగన్వాడీలకు సంబంధించి పూర్తి స్థాయిలో న్యాయం చేసేవరకు ఉద్యమాలు కొనసాగిస్తాం. – బుక్కే విశ్వనాథ్‌నాయక్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



కూటమి సర్కార్ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతిసారి వారు ఉద్యమ బాట పట్టాల్సి వస్తోంది. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి కష్టపడి పనిచేస్తున్న వారికి ప్రభుత్వం బాసటగా నిలవాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు ముందు ఒకమాట చెప్పడం, తర్వాత విస్మరించడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. – ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

నా భర్తను పోలీసులు తీసుకెళ్లారు

- ముందురోజు రౌడీలు వచ్చి బెదిరించారు
- అప్పు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేసినందుకే
- ఇంటి వద్దనుంచి తీసుకెళ్లడంపై అనుమానాలు
- జనసేన నేతల వత్తిడికి తలొగ్గిన పోలీసులు
- నా భర్త ప్రాణానికి హాని జరిగితే.. జనసేన నేతలే కారణం
- నందలూరు మండలవాసి రాధ ఆవేదన



రామసుబ్బారెడ్డి



రామసుబ్బారెడ్డిని తీసుకెళుతున్న దృశ్యం

రాజంపేట: 'నా భర్తను పోలీసులు తీసుకెళ్లారు. ఎందుకు తీసుకెళ్లారో తెలియదు. మాకు రావాల్సిన బాకీపై కోర్టులో వేసి క్రమంలో డిక్రీ వచ్చింది. ఈ నేపథ్యంలో ముందురోజు కొంతమంది రౌడీలు వచ్చి బెదిరించారు. ఆ తర్వాత పోలీసులే నేరుగా రంగంలోకి దిగి నా భర్తను తీసుకెళ్లారు. ఎక్కడున్నాడో తెలియని పరిస్థితి' అంటూ నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెకు చెందిన దండు రామసుబ్బారెడ్డి భార్య రాధ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నందలూరు మండలంలో కుమ్మరపల్లెకు చెందిన యల్లటూరు యాదగిరిరాజు 2015లో విజయప్రగతి చిట్స్‌ఫండ్స్ ఏర్పాటు చేశారు. అనేకమందిని సభ్యులుగా చేర్చుకున్నారు. మోసపూరితంగా, అక్రమంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసుకొని ప్రజలను మోసగించి సంస్థ మూసేశారు. దీనిపై రాజంపేట టౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నంబరు118/2018 కింద కేసు నమోదు అయింది. చిట్‌ఫండ్ వ్యాపారం నిమిత్తం రాజు రామసుబ్బారెడ్డి వద్ద రూ.99లక్షలు దాకా తీసుకున్నారు. ప్రామిసరి నోటు రాయించి ఇచ్చారు. అనేక పర్యాయాలు డబ్బు అడిగినా చెల్లించక కాలయాపన చేశారు. రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లో ప్రానోట్‌ను బాకీ నిమిత్తం దావా దాఖలు చేశారు. నందలూరు కోర్టులో డిక్రీ అయి అరెస్టు వారెంట్ కు ఈపీ దాఖలు చేశారు. ఈ విషయంలో కేసు వెనక్కి తీసుకోవాలని శుక్రవారం, శనివారం రోజున కొంతమంది రౌడీలు వచ్చి రామసుబ్బారెడ్డిని బెదిరించారు. అతడిని పక్కకు తీసుకెళ్లి దౌర్జన్యంగా వ్యవరించారు. ఎవరు అని అడిగితే నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని ఆరవపల్లెకు చెందిన వారమని తెలిపారు. సోమవారం 4 గంటలకు మూడు జీపులలో పోలీసులు వచ్చి కారణం చెప్పకుండానే రాధను ఇంటిలోకి పంపించి దండు రామసుబ్బారెడ్డిని తీసుకెళ్లారు. ఇపుడు ఆయన ఎక్కడ ఉన్నారో తెలియడం లేదని, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయిందని రాధ ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ గోడును జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినందుకే తన భర్తను పోలీసులు తీసుకెళ్లారనే అనుమానాలు ఉన్నాయన్నారు. తన భర్తకు ఏమైనా జరిగితే అందుకు జనసేన నేతలు యల్లటూరు శ్రీనువాసరాజు, యల్లటూరు శివరామరాజు, పోలీసులే కారణమని రాధ అంటున్నారు.

అపార్ ఐడీ నమోదును వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం: అపార్ ఐడీ నమోదులో మండలం చాలా వెనుకబడింది, ఐడీ జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయనతో పాటు మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లు స్థానిక స్త్రీ శక్తి భవనంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీజీఆర్ఎస్, సీఎంవో ఫిర్యాదులు, గృహాల జియోట్యాగింగ్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. మంచి పనితీరు కనబరిచిన తహశీల్దార్ శ్రీరాములు నాయక్‌ను అభినందించారు.

- మండలంలోని వరికసువుపల్లిలో ప్రభుత్వ భూమి విషయంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై కలెక్టర్ ఆరా తీశారు.

అభివృద్ధి పథకాలపై సమావేశం

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నాయనచెరువుపల్లె రోడ్డులోని సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఏపీడీ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



కురబలకోటలోని కంటేవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రాయచోటి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని.. అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగానికి కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సూచించారు. భారీ వర్షాలు కురిస్తే చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అల్పపీడన ప్రభావంతో మంగళవారం నుంచి రెండు మూడు రోజులు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వాతావరణశాఖ అధికారుల సమాచారం మేరకు అన్నమయ్య జిల్లాలో 28,29వ తేదిల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

కంట్రోల్ రూములు ఏర్పాటు.......

జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో మంగళవారం మధ్యాహ్నంలోగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించబడిన లోతట్టు ప్రాంతాలు, పొంగి పొర్లే రోడ్లు, ఇతర ప్రదేశాలలో తగు ముందస్తు చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రైతులను అప్రమత్తం చేయాలి.....

అన్నమయ్య జిల్లాలోని అన్నిట్యాంకులలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సాగు, కోత దశలలో ఉన్న పంటల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకునేలా అప్రమత్తం చేయాలని తెలిపారు. రైతులకు సంబంధించిన పంటలు, ధాన్యం, పశుసంపదను సురక్షితంగా కాపాడుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

గండ్లు పడకుండా చూడాలి: జిల్లాలో చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండవచ్చని కలెక్టర్ హెచ్చరించారు. అలాంటి వాటిపట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇసుక బ్యాగ్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకి రావద్దని కలెక్టర్ సూచన చేశారు.

ప్రభుత్వ ఆక్రమిత భూములపై దృష్టి సారించండి

కురబలకోట: ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఎలాంటి పరిస్థితిలోను ఉపేక్షించవద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం ఆయన కురబలకోట రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడి నుంచే ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారిని తిప్పించుకోకుండా సకాలంలో పనులు చేయాలన్నారు. కంటేవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

పీలేరు తహశీల్దారుపై ఫిర్యాదు

ఇదివరలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం పీలేరులో ఉన్న తహశీల్దారు ఎం.భీమేశ్వరరావుపై పలువురు ఈ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన హయాంలో జరిగిన పనులపై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ త్వరలో ప్రత్యేకంగా కురబలకోటలో గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తానని తెలిపారు.

మంత్రి నోటి మాట నిజమవుతుందా..

నీరుగారుతుందా!



మంత్రి నిమ్మల రామానాయుడు

- అడివిపల్లె రిజర్వాయర్‌కు నీళ్లిస్తామన్న మంత్రి నిమ్మల
- 2014-19 హయాంలో అడివిపల్లె రిజర్వాయర్‌కు నీళ్లిచ్చే పనులను గాలికి వదిలేసిన టీడీపీ
- నిజానికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే అన్నమయ్య-శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దుల్లో సొరంగం పనులు పూర్తి
- ఇంకా మిగిలి ఉన్న పనులు



అన్నమయ్యజిల్లా పెద్దమండ్యం మండలంవైపు వచ్చే సొరంగం (ఫైల్)

బి.కొత్తకోట: ఆరేడునెలల్లో అడివిపల్లె రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు తరలిస్తాం.. ఇటీవల జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పిన మాటలివి. నిజానికి ఇంత వరకు ప్రధాన కాలువ, దీనికి అనుబంధంగా నిర్మించిన ఉపకాలువలు, రెండు రిజర్వాయర్లకు కృష్ణా జలాలు చుక్కనీరు ప్రవహించలేదు. మంత్రి నిమ్మల తాను చెప్పిన మాటలను నిజం చేసి కృష్ణా జలాలు తరలించాలంటే కీలకమైన శ్రీసత్యసాయి-అన్నమయ్యజిల్లా సరిహద్దులోని ఎన్పీ కుంట మండలం పెద్దరాంపల్లె-పుల్లకూరవాండ్లపల్లె సొరంగం పనులు పూర్తి చేయాల్సి ఉంది. అప్పటికి గానీ అన్నమయ్యజిల్లాలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ, ఉప కాలువలు, రిజర్వాయర్లకు నీరందదు. ఈ సొరంగం పనుల కోసం జిల్లాలో 3,500 కోట్ల పనులు పూర్తి చేశారు. 2014-19లోని టీడీపీ ప్రభుత్వం ఈ సొరంగం పనులపై పూర్తి నిర్లక్ష్యం చేసింది. పనుల అంచనాలు పెంచుకుని వదిలేసింది. సీఎంగా ఉన్నా కూడా చంద్రబాబు తన సొంత జిల్లా ప్రజలను నిలువునా మోసం చేశారు.

చిత్తశుద్ధితో పనులు చేసిన వైఎస్సార్ సీపీ

దీని ప్రాధాన్యత గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయించింది. సొరంగం పనులు పూర్తి కాకుండా ఉంటే ఇప్పుడు అడివిపల్లె రిజర్వాయర్‌కు నీళ్లిస్తామన్న మాటే మంత్రి నోటి నుంచి వచ్చేదే కాదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పని పూర్తి చేయించకపోవడంవల్లె కృష్ణా జలాలు పారలేదు. శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని పట్నం వద్ద మొదలయ్యే ప్రధాన కాలువ ఎన్పీకుంట మండలం మీదుగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యంలోకి ప్రవేశిస్తుంది.

అంచనా పెంచి వదిలేశారు

శ్రీసత్యసాయిజిల్లా లోని ఎన్పీ కుంట మండలం పెద్దరాంపల్లె-పుల్లకూరవాండ్లపల్లె మధ్యలో హంద్రీ-నీవా ప్రధాన కాలువపై 5.20 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వకం, లైనింగ్ పనులను పూర్తి చేయాల్సివుంది. 3.5కిలోమీటర్ల సొరంగం తవ్వకం, లైనింగ్, రెండువైపులా 150 మీటర్ల కాలువ నిర్మాణం పనులను రూ. 27.12కోట్లతో శ్రీఅవంతిక సాయి వెంకట జాయింట్ వెంచర్ సంస్థ చేపట్టింది. ఈ సంస్థ 2015 మార్చినాటికి రూ.6.34 కోట్ల పనులు చేసి వదిలేసింది. మరో రూ.20.78కోట్ల పనులు నిలిచిపోగా గత టీడీపీ ప్రభుత్వం 2016లో సొరంగం, కాలువ పనులకు అంచనాలు పెంచగా మ్యాక్స్ ఇన్‌ఫ్రా(ఐ) లిమిటెడ్ సంస్థ రూ.15.08కోట్లతో పనులు దక్కించుకొంది. ఈ సంస్థ రూ.6.64కోట్ల పనులే చేసి మిగిలిన రూ.8.43 కోట్ల పనులు వదిలేసింది. లైనింగ్ పనులను వెడ్సర్ కన్స్‌స్ట్రక్చర్ సంస్థకు రూ.17.75 కోట్లకు అప్పగించగా రూ.65లక్షల పనులే పూర్తి చేసినట్టు వదిలేయంతో ప్రధాన కాలువలోకి కృష్ణా జలాలను తరలించడం సాధ్యం కాలేదు. దీని ప్రభావం తీవ్రంగా చూపింది.


తరలింపు సాధ్యమా

ప్రధాన కాలువ నుంచి అడివిపల్లె రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను ఆరేడుమాసాల్లో తరలించడం సాధ్యమా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ కాలువ సాగే మార్గంలో ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.80 కోట్ల పనులు పూర్తి చేయించాల్సి ఉంది. మంత్రి మాటిచ్చినట్టు వెంటనే పనులు చేపడితే నీటిని తరలించవచ్చు. అక్కడక్కడ నీటి ప్రవాహానికి ఆటంకాలు ఉన్నాయి. దీన్ని అధిగమించి మాట నిలుపుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్ఈ రాజగోపాల్ మాట్లాడుతూ కాలువలో కొన్నిచోట్ల చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. పుంగనూరు ఉపకాలువకు నాలుగుసార్లు కృష్ణా జలాల తరలింపు జరిగింది. ప్రస్తుతం ప్రధాన కాలువకు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

జగన్ పాలనలో పూర్తయింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సొరంగం పనుల్లో కదలిక వచ్చింది. నిలిచిపోయిన 115 మీటర్ల పనులను పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టారు. 2020లో చేపట్టిన పనులు 2021 చివరినాటికి పూర్తయ్యాయి. సొరంగం పనులు పూర్తి కావడంతో లైనింగ్ పనులు చేయించాల్సి ఉంది. కాలువనుంచి నీటిని తరలింపుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేదని అధికారులు స్పష్టం చేశారు. కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం 920 క్యూసెక్కులు. లైనింగ్ లేనికారణంగా 750 క్యూసెక్కుల నీటిని తరలించే వీలుంది. ప్రస్తుతం ఈ పనులు పూర్తికావడం ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు ఎంతో ప్రయోజనం. అన్నమయ్య జిల్లాలో ప్రధానకాలువ 30 కిలోమీటర్లు సాగుతుంది.

సస్యశ్యామలం అయ్యేనా..



కేవీపల్లె మండలంలోని అడివిపల్లె రిజర్వాయర్

ఎన్పీ కుంట మండలంలో సొరంగం పనులు పూర్తి కావడంతో శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లె రిజర్వాయర్‌కు అక్కడినుంచి ప్రధానకాలువ ద్వారా పెద్దమండ్యం మండలం మీదుగా కేవీపల్లె మండలంలోని అడివిపల్లె రిజర్వాయర్‌కు జిల్లాకు కృష్ణా జలాలను తరలిస్తారు. ఈ కాలువ నుంచి పెద్దమండ్యం మండలం మీదుగా చిన్నమండ్యం మండలంలోని శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు, ప్రధానకాలువకు అనుబంధంగా నిర్మించిన ఉపకాలువలకు నీటిని అందించవచ్చు. అక్కడినుంచి చెరువులకు మళ్లిస్తే పంటల సాగుకు అవకాశం కలుగుతుంది. ఫలితంగా తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. మరి మంత్రి తన నోటి మాటను నిజం చేస్తారో...నీటి మూటగా మారుస్తారో చూడాలి.

క్లుప్తంగా

రవాణా అధికారుల స్పెషల్ డ్రైవ్ – 10 వాహనాలు సీజ్



చిట్వేలి-కోడూరు రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ డీఎం

రాజంపేట : చిట్వేలి–కోడూరు మార్గంలో రవాణాశాఖ, ప్రజారవాణాశాఖ సంయుక్తంగా సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంవీఐ వినోద్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య తమ శాఖల సిబ్బందితో పలు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు రూ.74వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ ప్రైవేటు వా హనాల్లో ఓవర్‌లోడ్‌తో తరలిస్తుంటే చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల ద్వారా తమ గమ్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రవాణా, ఆర్టీసీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో శ్రీను మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన శ్రీను (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ శివార్లలోని వరిగ రోడ్డులో చిన్నపాటి గుట్టకు పక్కన నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు రాయచోటి పట్టణంలోని 15వ డీలర్ షాప్ వాహనంలో బియ్యం పంపిణీ సహాయకుడికిగా పని చేసేవాడు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తలకు రక్తగాయాలు ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనపై అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ మృతుడు సోమవారం రాత్రి 8–30 గంటల తరువాత ఎవరి ఫోన్ తీయలేదన్నారు. అతని ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదన్నారు. మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించామని చెప్పారు. సంఘటన స్థలంలో మద్యం సీసాలు ఉన్నాయన్నారు. మృతుడు మద్యం తాగి మృతి చెందాడా.. లేక మద్యంలో ఏదైనా విషం కలపడం వలన మృతి చెందాడా అనే కోణంలో విచారణ చేస్తున్నామని తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ



కడపలోని జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులచేత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె. హేమస్రవంతి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు, రైతాంగంపై మొండి వైఖరి వీడాలి

- అఖిలపక్ష కార్మిక, రైతు సంఘాల నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా
- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : కార్మికులు, రైతాంగం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండివైఖరి వీడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్స్, అఖిలపక్ష రైతు సంఘాల మహాధర్నా నిర్వహించారు. ఒకవైపు వర్షపు జల్లులు కురుస్తున్నా కార్మిక కర్షక సంఘాల నాయకులు, కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నినదించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆకలి కేకలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద మధ్య తరగతి కుటుంబాలను ఆదుకొని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్లకు లాభాల కోసమే ఊడిగం చేస్తోందని ఆరోపించారు. అందుకే వారికి సంబంధించిన రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోక కృష్ణప్ప, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మీ, రవికుమార్, శ్రీలక్ష్మీ, సురేంద్ర, మెహరున్నీసా, ఏపీఎండీసీ శ్రీనివాసులు, ఎస్ఎస్ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య వివిధ కార్మిక సంఘాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనతో అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : అరాచక పాలనతో రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మంగళవారం రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. ఏ ఒక్కరు గొంతు విప్పినా పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురి చేయడం, వారిని వ్యక్తిగతంగా బెదిరించడం వంటి చర్యలు తగదన్నారు.

ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే కేసులా..

ప్రభుత్వ విధానాలలోని తప్పులను ఎత్తిచూపితే కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోందన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ యూనిట్ రూ.2.49లతో కొనడం తప్పా.. చంద్రబాబు నాయుడు యూనిట్ రూ.4.50లు, రూ.6లు పెట్టి కొంటే తప్పు లేదా అని ప్రశ్నించారు. లేని అంశాలను తీసుకొచ్చి జగన్‌పై బురద జల్లుతున్నారన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు మేలు జరగలేదని కూటమి నేతలు గగ్గోలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా వారికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం ఏంటని నిలదీశారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఆ వ్యవస్థే లేదంటున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1.35 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాల నియామకాలు చేపట్టారో చెప్పాలన్నారు. వారు వీరు అని గాకుండా అన్ని వర్గాల వారిని దగా చేసిన ప్రభుత్వం ఇది అని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్ గౌస్ ఖాన్, బీసీ సెల్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

యుద్ధంతో మానవాళికి ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త సతీష్‌కుమార్. వేదికపై పురప్రముఖులు

రాయచోటి అర్బన్ : యుద్ధంతో మానవాళికి తీరని ముప్పు ఏర్పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిశుభ కళ్యాణ మండపంలో 'సేవ్ వరల్డ్– నో వార్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రముఖ వైద్యుడు బయారెడ్డి మాట్లాడుతూ యుద్ధాల వలన ప్రజల ప్రశాంత జీవనానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికమార్గంలో పయనిస్తూ ప్రపంచ శాంతికి పాటు పడాలని కోరారు. ఆధ్యాత్మికవేత్త సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆధిపత్య పోరులో భాగంగా జరుగుతున్న యుద్ధాలు భవిష్యత్తులో అణు యుద్ధాలకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. లయన్స్‌క్లబ్, రోటరీక్లబ్‌ల మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ యుద్ధాల పట్ల ఉన్న వ్యతిరేకతను ప్రపంచదేశాల నేతల దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నేత శ్రీనివాసరాజు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ రోటరీక్లబ్, మానవతా సంస్థల ప్రతినిధులు, పలు పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీకి ఎంపిక



సోడి ఇందు

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని చౌటపల్లి పంచాయతీ, గొల్లపల్లికి చెందిన సోడి వెంకటేశ్వర్లు కుమార్తె సోడి ఇందు ఎస్వీ యూనివర్సిటీలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మహిళల విభాగానికి ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈనెల 29వ తేదీ అలగప్ప యూనివర్సిటీ కరైకుడిలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

బేస్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం



అండర్ -14 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ మూడో స్థానం దక్కించుకున్న బాలుర జట్టు

రాయచోటి టౌన్ : తిరుపతిలో అండర్ –14 విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీల్లో బాలికలు, బాలుర విభాగంలో రెండింటిలోనూ ఉమ్మడి కడప జిల్లా జట్లు మూడో స్థానం దక్కించుకున్నాయి. కాగా రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎం. సంతోష్, 8వ తరగతి చదువుతున్న బి. సంతోష్‌లు జాతీయ జట్టుకు ఎంపికయ్యారని రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య తెలిపారు. జాతీయ జట్టుకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులు డిసెంబర్ నెలలో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే బేస్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, వేణు మాధవ్ రాజు, రవీంద్రరాజు, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ అభినందించారు.

స్వేచ్ఛ కల్పించేదే రాజ్యాంగం

కడప ఎడ్యుకేషన్ : ప్రతి పౌరునికి సమానత్వం, స్వేచ్ఛ కల్పించేదే భారత రాజ్యాంగం అని రాజంపేట ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పి. శంకర్ పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కడప శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తనయుడి దాడిలో గాయపడిన తల్లి మృతి



మృతి చెందిన ఓబులమ్మ

పెద్దమండ్యం : ఓ తనయుడు వృద్ధురాలైన తన తల్లిపై రోకలిబండతో విచక్షణారహితంగా చేసిన దాడిలో గాయపడిన తల్లి సోమవారం రాత్రి మృతి చెందింది. ఆదివారం తనయుడి దాడిలో తల్లి రెండు కాళ్లు విరిగిపోగా, తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ హృదయ విదారక సంఘటన మండలంలోని సీ గొల్లపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోడెం ఓబులమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు బోడెం ఓబులేసు వివాహితుడు. అయితే మనస్పర్థలు రావడంతో ఇతని భార్య పిల్లలను తీసుకెళ్లి వారి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఓబులేసు తన తల్లి ఓబులమ్మ (70) వద్దే ఉంటున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఓబులేసు తన తల్లిపై రోకలి బండతో విచక్షణారహితంగా దాడి చేశాడు. బాధితురాలిని తిరుపతి స్విమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో స్విమ్స్ వైద్యులు చెన్నైకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓబులమ్మను ఇంటికి తీసుకురాగా సోమవారం రాత్రి మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ములకలచెరువు సీఐ లక్ష్మన్న పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తామంటే నేరుగా నాకు తెలపండి

విద్యార్థినులకు సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి సూచన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి

రాజంపేట టౌన్ : ఎవరైనా తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేసేందుకు సిద్ధపడితే నేరుగా తనకు తెలపాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి విద్యార్థినులకు సూచించారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సోమవారం రాత్రి సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ఓ స్నేహితురాలిలా కలిసిపోయి వారి కష్ట, సుఖాలను తెలుసుకున్నారు. విద్యార్థిదశ ఎంతో విలువైనదని, ఈ దశలో విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. బాగా చదువుకుంటేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. పేదరికం నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆహార పదార్థాలు ఎలా ఉంటున్నాయి, హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని, వసతిగృహ అధికారిణి ఎలా చూసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొలుత సబ్‌కలెక్టర్ హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను, సరుకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు

పశువుల గర్భకోశ వ్యాధులపై అవగాహన అవసరం

జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై



కొటాలలో దూడలకు నట్టల నివారణ మందులు తాగిస్తున్న పశువైద్యాధికారులు

కలికిరి : పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణపై రైతులు కనీస అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధితో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తగు జాగ్రత్తలతో గర్భకోశ వ్యాధులను అధిగమించవచ్చన్నారు. వైద్య శిబిరంలో 160 పశువులకు గోమార్ల నివారణ మందులు అందజేశారు 48 పశువులకు గర్భ పరీక్షలు, 45 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. 54 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ పశువైద్యశాఖ ఏడీ కె.సత్యనారాయణ, ఏడీఏ విశ్వేశ్వర రెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కలికిరి ఏడీఏ వెంకటమునినాయుడు, కేవీకే సమన్వయకర్త డాక్టర్ మంజుల, పశువైద్యాధికారులు గిరినాథరెడ్డి, హేమకుమార్, నవీన, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య బృందం పర్యటన

రామాపురం : మండల పరిధిలోని సరస్వతిపల్లె దళితవాడలో పశువైద్య బృందం మంగళవారం పర్యటించింది. అక్కడ కొన్ని పశువులకు ముద్ద చర్మ వ్యాధిని గుర్తించి వాటికి వైద్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.సుధీర్‌నాథ్ బెనర్జీ, సహాయ సంచాలకులు డాక్టర్ కె. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో రాజ్యాంగ దినోత్సవం



పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ కె. వెంకటరెడ్డి ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగం పట్ల వినయ విధేయతలు కలిగి ఉంటామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులకు మార్గదర్శకం రాజ్యాంగం



బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : ప్రజాస్వామ్యంలో దేశ పౌరులకు మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం అని రాజ్యాంగంలోని పీఠికను ప్రతి ఒక్కరూ చదివి అర్థం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో 75వ రాజ్యాంగ దినోవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ మధుసూదన్ రావులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామని జేసీ తెలిపారు. అనంతరం రాజ్యాంగ పీఠికను కలెక్టర్ కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ చదవుతూ కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే ప్రజలకు రక్ష – జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ అని అలాంటి రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరూ పనిచేస్తూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ముఖ్యమైందన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రాజ్యాంగ బద్ధంగా నడవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ బి చిన్నికృష్ణ, ఎస్‌బీ సీఐ సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ వీజె రామకృష్ణ, ఇతర పోలీసు అధికారులు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి



రెడ్డికావ్యశ్రీని సన్మానిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

వీరబల్లి : విద్యార్థులను చదువుతోపాటు క్రీడల వైపు కూడా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని రాష్ట్ర, క్రీడలు, రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని వంగిమల్ల పంచాయతీ, ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని రెడ్డి కావ్యశ్రీ ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన 68వ జాతీయ పోటీలలో ప్రతిభ కనబరచడంతో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ పిల్లలను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ మంత్రి కె.సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ శ్రావణి, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీటీసీ నాగులమ్మ, రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ మోహన్ నాయక్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వాణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారూ.. పరిష్కారం చూపరూ.!


రాయచోటి (జగదాంబసెంటర్) : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతర జిల్లా నుంచి కూడా ప్రజలు ప్రజా దర్బార్‌కు వచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నివేదిక పంపాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి నియోజకవర్గంలో పూర్తిస్థాయి సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి అవసరమైన నివేదికలను అధికారులు వెంటనే తయారు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డి ల్లె, రామాపురం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఎక్కడ సిమెంట్ రోడ్ల నిర్మాణం అవసరమో గుర్తించి వాటి ర్మాణానికి నివేదికలు తయారుచేసి అందజేయాలన్నారు. వాటికి ఉన్నతాధికారుల వద్ద అనుమతులు పొంది రోడ్లనిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ దయాకర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ వేసేందుకు వెళ్తే దాడికి యత్నిస్తారా?

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : రాజుపాళెం మండలానికి సంబంధించి రహదారుల పనులకు టెండర్ వేయడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరించడమే గాక వారిపై టీడీపీ నాయకులు దాడికి ప్రయత్నించారని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజుపాళెం మండలంలోని చిన్నశెట్టిపల్లె– గాదెగూడూరు, పొట్టిపాడు–కుమ్మరపల్లె రోడ్డు పనులకు రూ. 11 కోట్లతో రెండు టెండర్లు పిలిచారన్నారు. ఈ రెండు పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సర్వే చేయించి మంజూరు చేయించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గానీ, రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులెవరూ టెండర్ వేయద్దొనే విధంగా టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ పనులకు సంబంధించి కొన్ని పత్రాలను ఇవ్వడానికి తమ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డితో పాటు మరో ఇద్దరు సోమవారం కడప ఎస్ఈ కార్యాలయానికి వెళ్లారన్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద ఉన్న పేపర్లను లాక్కునే ప్రయత్నం చేయడంతో పాటు వారిపై దాడికి యత్నించారని తెలిపారు.